# ఏ ఎండకా గొడుగు




సాయంత్రం టపాలో వచ్చింది శుభలేఖ. తెల్లవారితే విజయవాడలో పెళ్ళి. తప్పనిసరిగా వెళ్ళాలి. కాని వెళ్ళడానికి అడ్డంకులున్నాయి. రేపు చేను కొయ్యాలి. కూలీలను పురమాయించుకున్నాడు. కాని వెళ్ళకపోతే బాగోదు. చిన్నారావు చివరకి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

ప్రయాణం సంగతి తల్లిని కేక వేసి చెప్పాడు. వెంకాయమ్మ ముందర రానని గుణిసింది. కొడుకు బలవంతం వల్ల ఒప్పుకుంది.

"బట్టలు సర్దు....పొలం వెళ్ళి కూలీలను రావద్దని చెప్పి వస్తాను." చిన్నారావు చెప్పులు వేసుకుని వెళ్ళాడు.

వెంకాయమ్మ కొడుకు వచ్చేసరికి బట్టలు సర్దింది. ఇద్దరూ భోజనాలు చేసి రిక్షాలో టౌన్‌కి వచ్చారు. బస్‌స్టాండు పెళ్ళిళ్ళ సీజన్ వల్ల రష్‌గా వుంది. బస్సులన్నీ రద్దీగా వున్నాయి. చిన్నారావు మూడు గంటలు కుస్తీ పట్టినా ఏ బస్‌కీ టికెట్టు సంపాదించలేక పోయాడు.

పన్నెండున్నరకి ఆఖరి ఎక్స్‌ప్రెస్ కూడా వెళ్ళిపోయింది. టాక్సీగాని, లారీగాని పట్టుకుందామని ఎదురుగా వున్న జంక్షనుకి వచ్చారు. కిళ్ళీ కొట్లు, కాకాహోటళ్ళు యింకా వ్యాపారం చేసుకుంటున్నాయి.

## చిట్టి కథ

వీరిలాగే మిగతా ప్రయాణీకులు కూడా అక్కడికి వచ్చారు. టాక్సీవాళ్ళు జనాన్ని చూసి రేటు పెంచేశారు.

ఏం చేద్దాం?....చిన్నారావు ఆలోచిస్తున్నాడు. ఇంతలో పేవ్‌మెంటు దగ్గర సరికొత్త కారొకటి ఆగింది. అందులో నుంచి ఓ యువకుడు దిగి పాన్‌షాపులో సిగరెట్ పెట్టె కొనుక్కుంటున్నాడు.

"అబ్బాయ్....త్రిలోక్ కదరా!" అంది వెంకాయమ్మ.

అవును. త్రిలోక్‌ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది. దగ్గరకెళ్ళి పల్కరించాడు.

త్రిలోక్ గతంలో వారి యింట్లో వారాలు చేసి చదువుకున్నాడు. ఇప్పుడు కాంట్రాక్టులు చేసి సంపాదిస్తున్నాడు.

"నీది అఖండ జాతకమయ్యా! ఆ దొప్ప చెవులు చూసి అదే అనేదాన్ని గుర్తుందా?" అని వెంకాయమ్మ ప్రశంసించింది.

"మీ ఆశీర్వాదం పెద్దమ్మగారూ. ఇవాళే కారు కొన్నాను. తిరుపతిపోయి వద్దామని బయలుదేరాను." అన్నాడు త్రిలోక్.

"మమ్మల్ని కాస్త విజయవాడలో దింపు బాబూ. బస్సు దొరక్క అవస్థ పడుతున్నాం." వెంకాయమ్మ అడిగింది.

ఎవరో తనని పిలవడంతో త్రిలోక్ పక్కకు తిరిగాడు. ఇంజనీర్ మాధవరావు, ఫ్యామిలీతో వున్నాడు. పైగా ముగ్గురు పిల్లలు, కారు సర్వీసు కిచ్చారుట. అర్జంటుగా ఏలూరు బయలుదేరవలసి వచ్చిందట అత్తగారికి జబ్బు చేసిందని.

"రండి సార్. నేను డ్రాప్ చేస్తాను." త్రిలోక్ వారిని ఎక్కించుకుని వెళ్ళిపోయాడు.

వెంకాయమ్మ, చిన్నారావు చిన్నబోయారు.

"నడిమంత్రపుసిరి....కళ్ళు కనపడవు. అడిగినందుకైనా తీసుకు వెళ్ళొచ్చు. మనకంటే వాళ్ళు ముఖ్యమా? ఎప్పుడో క్రిందపడతాడు. అన్నానికి ముఖం వాచిపోతాడు కుంక." వెంకాయమ్మ తిట్టిపోసింది.

"ఎంగిలి మెతుకులు తిన్న వెధవకి విశ్వాసం లేదు. ఉత్త కృతఘ్నుడు. ఏరు దాటి తెప్పతగలేసే రకం." చిన్నారావు అందుకున్నాడు.

మొత్తానికి టాక్సీలో యిద్దరూ పెళ్ళికి వెళ్ళారు. వారం రోజుల తర్వాత త్రిలోక్ వారి యింటికి వచ్చాడు. తల్లీ కొడుకులు ఘనంగా మర్యాద చేశారు.

"నీది దొడ్డమనసు బాబూ! నువ్వు ఏం చేసినా ఒక అర్థం వుంటుంది. అన్నీ తెలివి తేటలూ వున్నాయి కనుకనే చకచకా పైకి వచ్చావు. మేమూ వున్నాం ఎందుకూ?" వెంకాయమ్మ పొగిడింది.

"నీ మంచితనమే నిన్ను రక్షిస్తుంది బ్రదర్" అన్నాడు చిన్నారావు.

ఇంతకీ ఏం జరిగింది?

ఆ రాత్రి త్రిలోక్ కారు చెట్టుకు ఢీకొట్టింది. ఇంజనీర్‌గారి కుటుంబం అంతా చనిపోయారు. త్రిలోక్ ఒక్కడే బయటపడ్డాడు.

అందుకే తల్లీకొడుకులు గొడుగు మార్చేశారు.

—చెల్లూరి ఝాన్సీరాణి